క్లుప్తంగా

అన్న క్యాంటీన్ తనిఖీ



భోజనం నాణ్యతపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్‌లో భోజనాన్ని రుచి చూశారు. భోజనం చేస్తున్న వారి నుంచి నాణ్యతపై ఆరా తీశారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

గురజాల క్షేత్రంలో చోరీ



ఆలయంలో యాంపిల్‌ఫైర్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యం

నందవరం : దక్షిణ కాశీగా పేరు గాంచిన ప్రముఖ క్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాముున చోరీ జరిగింది. సర్పంచ్ వీరస్వామి, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆలయంలో మైక్‌కు సంబంధించిన యాంపిల్‌ఫైర్ చోరీకి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు రూ.30 వేల విలువజేసే సామగ్రిని దొంగలించారు. అయితే దేవదాయశాఖ అధికారి కేసు పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా ఆలయంలో చోరీ జరిగినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఆలయానికి సెక్యూరిటీ కూడా లేదని, సీసీ కెమెరాలు పనిచేయడం లేదని చెప్పారు. ఆలయ పురోహితులు హంపేష్ స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులకు కూటమి ప్రభుత్వం బకాయి ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్,ఆర్యన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఇంజినీరింగ్,డిగ్రీ,పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మంజూరు చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీలో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆన్‌కాల్ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జి.రంగన్న,ఎర్రిస్వామి,అధ్యక్ష,కార్యదర్శులు సోమేష్,కిషోర్ కోరారు.శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ మద్దిలేటినాయుడుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సంస్థ పర్యవేక్షణలో డ్రైవర్లుగా శిక్షణ పొంది ఆన్‌కాల్ డ్రైవర్లుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నా సంస్థ వారిని గుర్తించకపోవడం దారుణమన్నారు.వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బస్సు సర్వీస్ డ్యూటీకి వెళ్లినప్పుడు బ్రేక్ ఫెయిల్ అయితే ఇవ్వాల్సిన డబ్బులో కోత విధించి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.నాయకులు ఏవీ.రెడ్డి,వలి,కెహెచ్ రెడ్డి,ఎంసిఎస్ రావ్,సైపుల్లా, పంపాపతి పాల్గొన్నారు.

రైతులకు మొక్కల పంపిణీ



మొక్కలను అందజేస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం : రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం ఏపీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు రైతులకు కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, చీని, దానిమ్మ, అల్లనేరేడు, మామిడి మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ..మండలంలో 5 గ్రామ పంచాయతీలో 16 ఎకరాలకు సంబంధించి 12 మంది రైతులకు 2,641 మొక్కలు పంపిణీ చేశామని చెప్పారు. ఇందులో పానకలదిన్నె గ్రామానికి 1,080, సోమలగూడూరుకు 1,123, జగ్గాపురం–144, ఇబ్రహీంపురం కొట్టాల– 252, మాచాపురం గ్రామానికి– 42 మొక్కలు చొప్పున అందజేశామని వివరించారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ అందిస్తుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, టీఏలు, ఎఫ్ఏలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పల్లె వాసులు



పెద్దతుంబళంలో రోడ్డుపై చెత్తాచెదారం, మురుగునీరు



మండిగిరి పంచాయతీలో చెత్తాచెదారం వద్ద పందుల స్వైర్యవిహారం

ఆదోని రూరల్: గత ఇరవై రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాలన్నీ తడిసి ముద్దయ్యాయి. ఎక్కడికక్కడ పారిశుద్ధ్యం లోపించింది. దోమలు, పందులు స్వైర్యవిహారం చేస్తున్నాయి. తాగునీరు కూడా కలుషితమవుతున్నాయి. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. కనీసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంపైననూ అధికార యాంత్రంగం దృష్టి సారించడంలేదు. దీంతో ప్రభుత్వం, అధికారుల తీరు పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మంచం పట్టిన పల్లెలు

ఎడతెరిపిలేని వర్షాలతో మండలంలోని 44 గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులైన జ్వరాలు, విషజ్వరాలు, వాంతులు, విరేచనాలతో మంచం పట్టారు. గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెద్దతుంబళం, మండిగిరి, పెద్దహరివాణం, కపటి, పాండవగల్లు, సాంబగల్, ఆరేకల్, మదిరె, సంతెకూడ్లూరు, బైచిగేరి, చిన్నపెండేకల్, పెద్దపెండేకల్, విరుపాపురం, ఢణాపురం, నారాయణపురం, దొడ్డనగేరి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో దోమలు, పందుల బెడద అధికమయ్యింది. దోమకాటుకు గురైన ప్రజలు టైఫాయిడ్, మలేరియా వంటి రోగాలబారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేయాల్సి ఉండగా వైద్యాధికారులు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కిక్కిరిసిన ఆసుపత్రులు

ప్రజలు ఆదోని ఏరియా ఆసుపత్రితో పాటు దగ్గరలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం గ్రామాల్లోని ఆసుపత్రులకు వెళ్లడంతో కిక్కిరిసిపోతున్నాయి. ఏరియా ఆసుపత్రిలో ప్రతిరోజూ 220 నుంచి 250 వరకు , పెద్దతుంబళం, పెద్దహరివాళం పీహెచ్‌సీల్లో 50 నుంచి 60 వరకు ఓపీ ఉంటోంది. ఇందులో ఎక్కువ శాతం జ్వరపీడితులతో పాటు దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారు ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించి, ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకుంటాం



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే వెంటనే పంచాయతీ అధికారులకు తెలియజేయాలి. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సేవలందిస్తాం.

– జనార్దన్, ఎంపీడీఓ

వర్షపునీరు నిల్వ ఉంటున్నాయి



గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షపునీరు నిల్వ ఉంటున్నాయి. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమకాటకు గురై ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కనీసం పారిశుద్ధ్య పనులు చేసే వారే కరువయ్యారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టి, గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలి.– తిక్కప్ప, సంతెకూడ్లూరు గ్రామస్తుడు

11మంది విషజ్వరాల బారిన పడ్డారు



గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మా గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. సీజనల్ వ్యాధులు ప్రబలాయి. ఒక్క మా ఇంట్లోనే 11 మంది విషజ్వరాలబారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నా తల్లి రాధమ్మ వృద్ధురాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. వైద్యాధికారులు, ఇతర ప్రభుత్వశాఖల అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని అధికారులు తెలిసినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

– రామాంజనేయులు, గణేకల్ గ్రామస్తుడు

వర్షాలకు నష్టపోయిన చేనేతలను ఆదుకోవాలి



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న శివప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల కురిసిన వర్షాలతో మగ్గం గుంతల్లో నీరు చేరి ముడిసరుకు తడిచిపోయి నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం పట్టణంలోని 5వ వార్డు పరిధిలో నష్టపోయిన కార్మికుల కుటుంబాలను కలిసి మాట్లాడారు. వర్షాలతో గుడిసెల్లోనున్న తమ మగ్గాలతో పాటు ముడిసరుకు తడిచి నష్టపోయామని కొందరు కార్మికులు వారి దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నష్టం వాటిల్లినప్పుడు వలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బంది తమ ఇళ్లకు వచ్చి నష్టాన్ని తెలుసుకొని ఆర్థిక సహాయానికి అధికారులకు తెలిపేవారని గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వం నేతన్న నేస్తం కింద ఏటా రూ.24వేలు ఇచ్చేదని, వంద యూనిట్లు ఉచిత విద్యుత్ అందించేదని తెలిపారు. ప్రస్తుతం తాము నష్టపోయినా ఏ ఒక్కరూ పలకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా బూత్ కమిటీ కార్యదర్శి మోనే నారాయణ, బుట్టాబాబు రావ్, పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కనికె నాగేంద్ర, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం అంజి, 2వ వార్డు ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, 18వ వార్డు ఇన్‌చార్జ్ సోమేష్, బీసీ సెల్ నాయకులు యు.గిరి, నరేష్ పాల్గొన్నారు.

రెచ్చగొట్టే సమాచారం పోస్ట్ చేయొద్దు

- ఈనెల 27 నుంచి 31 వరకు గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోండి
- డీజేలో భక్తి పాటలనే పెట్టుకోవాలి
- డీఎస్పీ హేమలత



హాజరైన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు



పీస్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: సోషల్ మీడియా, ఫేస్ బుక్, ఇన్‌స్టాగామ్‌లలో రెచ్చగొట్టే సమాచారం పోస్ట్ చేయొద్దని, అలా చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రోషన్ గార్డులో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, రామలింగమయ్యతో పాటుగణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, ముస్లిం మతపెద్దలు, గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ హేమలత మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు ఆదోని నియోజకవర్గంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల సమయంలో రెచ్చగొట్టే పోస్టులను పెట్టి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయొద్దన్నారు. నిమజ్జనం రోజున మంటపాల వద్ద నుంచి ఉదయం 10.30 గంటలకు ర్యాలీ ప్రారంభం కావాలన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించుకునే వేడుకల్లో రాత్రి 10 గంటల కల్లా స్పీకర్లు ఆఫ్ చేయాలన్నారు. నిమజ్జనం రోజున డీజేలో భక్తి పాటలు మాత్రమే పెట్టాలని, సినిమా పాటలు పెడితే డీజేను ఆఫ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేస్తామన్నారు. మంటపాల వద్ద విగ్రహాలు ప్రతిష్ఠాపన చేసేవారు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు రామాంజనేయులు, మహేష్‌కుమార్, డాక్టర్ నాయక్ పాల్గొన్నారు.

పాసింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలి



యార్డు సెక్రటరీ కల్పనకు వినతి పత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ఆదోని అర్బన్: పాసింగ్ లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘం నాయకులు యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కల్పనకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ వేరుశనగ దిగుబడులను పాసింగ్ చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అలాగే సమయం కూడా వృథా అవుతుందని, వారు ఇళ్లకు చేరుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. ఎమ్మిగనూరు తదితర మార్కెట్‌యార్డులలో పాసింగ్ వ్యవస్థ లేదని, ఆయా మార్కెట్లలాగే ఆదోని మార్కెట్‌యార్డులో కూడా పాసింగ్ వ్యవస్థ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. పాసింగ్ పేరుతో కూలీలు, వ్యాపారులు రైతుల నుంచి డబ్బు గుంజుతున్నారని ఆరోపించారు.

మహిళా కూలీల ఆందోళన :పాసింగ్ వ్యవస్థను రద్దు చేయొద్దని మహిళా కూలీలు శుక్రవారం యార్డు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యార్డు సెక్రటరీ కల్పనతో మహిళా కూలీలు మాట్లాడారు. పాసింగ్ వ్యవస్థ ఉండడం వల్ల రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు తమకు ఆదాయం వస్తుందని, దాన్ని రద్దు చేస్తే ఎలా బతకాలని వాపోయారు. కాగా పాసింగ్ రద్దయితే జీవనోపాధి ఉండదని మహిళా కూలీలను వ్యాపారులే ఉసిగొల్పి పంపినట్లు సమాచారం.

డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత పాటించాలి

పెద్దకడబూరు: డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత పాటించాలని ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు ఎస్. లాలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ అధికారుల తీరు డీఎస్సీ అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టేస్తోందని విమర్శించారు. జిల్లాల వారీగా మొత్తం డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ లిస్ట్, ర్యాంకులు ముందుగా విడుదల చేయకుండా ప్రభుత్వం కేవలం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌కే సిద్ధమవుతుండడంతో అభ్యర్థుల్లో అయోమయం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాధికారులు తగిన చర్యలు తీసుకొని డీఎస్సీ అభ్యర్థుల్లో నెలకొన్న గందరగోళానికి పరిష్కారం చూపాలని కోరారు.

రుణాలు ఇవ్వడంలో అశ్రద్ధ వహించొద్దు



మాట్లాడుతున్న డిస్ట్రిక్ లీడ్ మేనేజర్ రామచంద్రరావు

మంత్రాలయం రూరల్: రైతులు, పొదుపు మహిళలు, విద్య కోసం వచ్చిన వారికి రుణాల మంజూరులో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా లీడ్ మేనేజర్ రామచంద్రరావు, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ రహీమాన్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గంలోని అన్ని బ్యాంకు మేనేజర్లు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొదుపు మహిళలకు రుణాలు మంజూరు చేసి ఆర్థిక పురోగతి సాధించాల్సిందిగా సూచించారు. మహిళల బలోపేతానికి కృషి చేయాలని, రుణాల మంజూరుతో పాటు వసూళ్లలోనూ పురోగతి సాధించాలని తెలిపారు. 2025–26 సంవత్సరానికి యాక్షన్ ప్లాన్‌ను పూర్తిచేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. రైతులకు పంట రుణాలు, విద్యార్థులకు ఉన్నత చదువుల రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఏపీఎంలు శ్రీను, రాజశేఖర్, వెంకటస్వామి, సత్యమ్మ, కెనరా బ్యాంక్ మేనేజర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో జీవితం చిత్తు



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ వేణుగోపాల్

కోసిగి: యువత మత్తు పదార్థాల బారిన పడకుండా దూరంగా ఉండాలని సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'మత్తుపదార్థాల వ్యసనం –పర్యవసనాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. యువత తెలిసీ తెలియక మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ భవిష్యత్తు చీకటిలోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యసనం కారణంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లిపోతున్నారని, ఫలితంగా జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థి దశలో చదువుపై దృష్టి సారిస్తే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, ఎస్ఐ హనుమంతరెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకే విక్రయించాలి

నందవరం : రైతులకు ఎరువులు, పురుగుల మందులను ఎంఆర్‌పీకే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. శుక్రవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో ఫర్టిలైజర్స్, కోరమండల్, శివకిరణ్ ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీనివాస ఆగ్రో ఏజెన్సీ దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ..రైతులకు విక్రయించిన ఎరువులు, పురుగు మందుల వివరాలను స్టాక్ రిజిస్టర్లలో పొందుపరచాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనుమతులు లేని పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల కొరత సృష్టిస్తే శాఖ పరమైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీఈఓ శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



పల్లెపాడు పాఠశాలలో సభ్యత్వ నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోసిగి: రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కౌలన్న, మండల అధ్యక్షుడు లక్ష్మన్న విమర్శించారు. శుక్రవారం కోసిగి మండలంలోని పల్లెపాడు, కోసిగిలో పాఠశాలల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ అమలు, 11వ పీఆర్సీ బకాయిలు, నాలుగు డీఏల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెస్మెంట్ బుక్‌లెట్ పేరుతో కొత్తగా తీసుకొచ్చిన పరీక్ష విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజు, శాంతన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



పుట్టపాశం వద్ద పత్తి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

గోనెగండ్ల: కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలు దెబ్బతింటున్నాయి. వాటిని బాగు చేసుకునేందుకు పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాతమ్మ, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. గురువారం మండలంలోని పుట్టపాశం గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంట కాయ తయారయ్యే దశలో ఉంది.పంట నీటి ముంపునకు గురైనప్పుడు పూత, పిందే, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబడి వాడిపోతాయన్నారు. పొలంలోని నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపి 2శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణం, 1శాతం మెగ్నీషియం సల్ఫేట్ ద్రావణం కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. వర్షం ఆగిన తర్వాత నాప్తలిన్ ఎసిటిన్ ఆసిడ్ (ప్లానోఫిక్స్) 1మిల్లీ 4.5 లీటర్ల నీటిలో కలిపిన 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తే పూత,పిందె రాలడాన్ని నివారించవచ్చన్నారు. వేరుకుళ్ళు తెగులు నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1గ్రాము కార్బండిజమ్ మందు ద్రావణాన్ని తెగులు సోకిన పాదుల చుట్టూ వేరు తడిచేలా పోయాలన్నారు. ఏఓ హేమలత, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవి కిశోర్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పనిచేస్తున్న హమాలీలకు లైసెన్స్ గుర్తింపు కార్డులతో పాటు పనిముట్లు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కార్యదర్శి పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లో పనిచేసే స్త్రీ, పురుష హమాలీలకు ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని కోరారు. అలాగే ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని ప్రమాదవశాత్తు ప్రాణనష్టం జరిగితే ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కాలు, చేయి విరిగి ఇబ్బంది పడితే ఆయా హమాలీలకు యాజమాన్యం బాధ్యత వహించి వారిని ఆదుకోవాలన్నారు. మార్కెట్ యార్డ్‌లోనున్న కమిషన్ ఏజెంట్లతో అధికారులు చర్చించి హమాలీలకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకుడు బాబు,పీవైఎల్ నాయకుడు రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు చిన్నహనుమన్న, ఉపేంద్ర,ఆనంద్ పాల్గొన్నారు.

అన్యాయంపై ఆగ్రహం



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన దివ్యాంగులు

కౌతాళం: దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం దారుణ ంగా వ్యవహరిస్తోందని సీపీఎం నేతలు విమర్శించా రు. అనర్హుల పేరుతో వేలాది మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించడంపై మండిపడ్డారు. కౌతాళం మండ లంలోనే 129 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు కావడంతో, శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై గంటకు పైగా బైఠాయించి ఆందోళన కొనసాగించారు. తమ వద్ద సరైన సర్టిఫికెట్లు ఉన్నా, 80 శాతం పైగా అంగవైకల్యం ఉన్నా పింఛన్లు రద్దు చేయడం అన్యాయ మని పేర్కొన్నారు. వీల్‌చైర్‌పై ఆధారపడేవారి, మంచానికే పరిమితమైన వారు, పుట్టుకతోనే గుడ్డి–చెవిటివారి పింఛన్లు కూడా రద్దు చేయడం హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు మల్లయ్య, ఈరన్న, దివ్యాంగుల తాలూకా అధ్యక్షుడు షేక్షావలి, మండల అధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ.. 1999 నుంచి రూ.75తో ప్రారంభమై ఇప్పటి వరకూ పొందుతున్న పింఛన్లను ఒక్కసారిగా రద్దు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కరుణ చూ పాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం



ఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దకడబూరు: రీ–వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకుడు పరమేష్ విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో అనేక మంది దివ్యాంగులు ప్రభుత్వం అందించే పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి పింఛన్లను రీ–వెరిఫికేషన్ పేరుతో తొలగిస్తే జీవనోపాధి కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన 156 పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓ కౌసల్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు సమర్పించారు. సీపీఎం నాయకులు ఈరన్న, సత్యన్న పాల్గొన్నారు.

ఉల్లిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గోనెగండ్ల: కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పైరులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం గోనెగండ్లలో వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలించారు. పంట దెబ్బతినకుండా 19:19:19 3గ్రాములు, సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5గ్రాముల లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఉల్లి గడ్డలకు కుళ్ళు రాకుండా మాలిక్ హైడ్రాజిడే ద్రావణం 5గ్రాములను ఒక లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలని చెప్పారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం అంచనాపై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

లింగమ్మ మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామ సర్పంచ్ తోలు లింగమ్మ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గంజిహళ్లి గ్రామ సర్పంచ్ తోలు లింగమ్మ గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శులు నాగేష్ నాయుడు, బందెనవాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ శుక్రవారం ఉదయం వేర్వేరుగా గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ తిరుమల రెడ్డి,మహేశ్వర రెడ్డి, గోవింద్, వెంకట్రాముడు,మల్లేష్, విజయ్, కోదండ రాముడు, బడేసావు, తిక్కయ్య పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం

ఆదోని టౌన్: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌భాను అన్నారు. శుక్రవారం షరీఫ్ బజార్ హెల్త్ సెంటర్‌లోని పి.ఎస్.రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వారం రోజులుగా దగ్గు తగ్గకపోవతే వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయితే డాక్టర్ల సూచనలతో క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బాబురాజు, చంద్రశేఖర్, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మభాయి, ఏఎన్ఎం జరీనా, ఆశావర్కర్లు లక్ష్మీ, దేవమ్మ, ధనలక్ష్మి, అరుణజ్యోతి, నీలమ్మ పాల్గొన్నారు.